# నినాదం

తెలంగాణ ప్రాంతీయం — నిఖార్సైన జర్నలిజం

గురువారం 23 అక్టోబర్ 2025




## ఎస్జిఎఫ్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన అల్ఫోర్స్ విద్యార్థి

**కరీంనగర్, అక్టోబర్ 22(నినాదం):** క్రీడల ద్వారా విద్యార్థులకు మేలు జరగడమే కాకుండా వారికి వివిధ పోటీ పరీక్షలలో విజయం సాధించడం చాలా సులువుగా ఉంటుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ లో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థి ఎస్జిఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే అన్ని రంగాలలో ముఖ్యంగా క్రీడా రంగంలో నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పించి క్రీడలలో నైపుణ్యం సాధించే విధంగా చేయూతనివ్వాలని కోరారు. పాఠ శాలలో విద్యార్థులకు అన్ని రకాలుగా వనరులను సమకూర్చి క్రీడా రంగంలో నైపుణ్యం సాధించే విధంగా చేయూతనివ్వాలని సూచించారు. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించినటువంటి ఎస్జిఫ్ అండర్ 14 జిల్లా స్థాయి చెస్ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి అక్కినపల్లి విస్తృత్ రామ్, 8వ తరగతి అత్యుత్తమ ప్రతిభ కనబరచడమే కాకుండా త్వరలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం ఇవ్వబోతున్నాడని హర్షం వ్యక్తం చేస్తూ విజేతకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి రాష్ట్రస్థాయిలోనూ విజయడంకా మ్రోగించి జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉమ్మడి జిల్లా యాదవుల రాజకీయ శిక్షణ శిబిరాలు

### యాదవ హక్కుల పోరాట సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బండి మల్లేష్ యాదవ్

**కరీంనగర్, అక్టోబర్ 22(నినాదం):** యాదవ హక్కుల పోరాట సమితి తరపున. యాదవులందరూ కలిసి రావాలని. ఈనెల 24, 25 తేదీలలో జరిగే ఉమ్మడి జిల్లా యాదవుల రాజకీయ శిక్షణ శిబిరం విజయవంతం చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బండి మల్లేష్ యాదవ్ పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులు పోటీ చేసి మేమెంతో మాకు అంత సీట్లు గెలవాలని రాజకీయంగా ఎదగాలని కోరుతూ, రాజకీయ శిక్షణ శిబిరాన్ని, సౌగాని కొమురయ్య యాదవ్ అరవింద ఫామ్ కాదరగూడెం లో యాదవ్ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుంది. రాబోయే రోజుల్లో యాదవులు గొర్లకు బర్లకు కాకుండా అన్ని విధాలలో ముందుకు పోవాలి తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభాలో మనది రెండో స్థానం ఉన్నాం. అత్యధిక జనం ఉన్న గ్రామాల్లో మండలాల్లో ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచి, ఎంపీపీ గెలిచి హక్కులను సాధించుకోవాలని ఇంత గొప్ప అవకాశాన్ని కరీంనగర్ ఉమ్మడి జిల్లా తరఫున పెట్టి నందుకు సౌగాని కొమురయ్య యాదవ్ ని మనస్ఫూర్తిగా అభినందిస్తూ రాబోయే రోజుల్లో సౌగాని కొమురయ్య యాదవ్ కు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ గా టికెట్ కూడా ఇవ్వాలని కోరుతున్నాం అన్నారు. ఇట్టి కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జంగా కొమురయ్య యాదవ్, ఉడుత రత్నాకర్ యాదవ్, నరసయ్య యాదవ్ వేణు యాదవ్, సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 24న యువ చైతన్య సదస్సు



**కరీంనగర్, అక్టోబర్ 22(నినాదం):** ఈనెల 24న శుక్రవారం రోజున జరిగే యువ చైతన్య సదస్సు యువతి, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని చైతన్య సదస్సును సద్వినియోగం చేసుకోవాలి అని పిలుపు నిచ్చిన మహాదేవ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉరుమల్ల విశ్వం. బుధవారం నాడు కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు, చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున యువ చైతన్య సదస్సును నగరంలోని గోదాంగడ్డ ఎస్.బి.ఎస్. ఫంక్షన్ హాల్ లో యువతను చైతన్యం చేసే దిశగా చైతన్య సదస్సు నిర్వహిస్తున్నా మన్నారు. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం లోనే పేరుగాంచిన మోటివేషన్ స్పీకర్లు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, కెరియర్ గైడెన్స్ గురువులు, విద్యా వేత్తలు, డాక్టర్ లు, న్యాయవాదులు, పార్టీ లకు అతీతంగా నాయకులు పాల్గొంటారని తెలిపారు. విద్యా, వైద్యం, ఉపాధి, కల్పన లో భాగంగా మహదేవ ఛారిటబుల్ ట్రస్ట్ ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు.భోజన వసతి కల్పించి నట్లు తెలిపారుఈ సమావేశంలో మహదేవ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడితో పాటు సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సంగీత పోటీలలో సత్తాచాటిన పారమిత విద్యార్థులు



**కరీంనగర్, అక్టోబర్ 22(నినాదం):** ఇటీవల డ్రీమర్స్ డ్రీమ్, లక్నో వారి.ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి సంగీత పోటీలలో స్థానిక నగరం లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులు పొందారని పాఠశాల డైరెక్టర్ హనుమంత రావు తెలిపారు. ఈ పోటీల వాయిద్య సంగీత విభాగంలో 7వ తరగతికి చెందిన కిట్ల.చరణ్ జాతీయస్థాయి 7వ స్థానం , 6వ తరగతికి చెందిన ఎ.వి.కె. కార్తీక్ జాతీయస్థాయి 24వ స్థానం మరియు గాత్ర సంగీత విభాగంలో 8వ తరగతికి చెందిన సోనాక్షి సురేష్ జాతీయస్థాయిలో 17 వ స్థానం పొంది బహుమతులు, సర్టిఫికెట్స్ అందుకున్నాడు. జాతీయస్థాయిలో బహుమతులు పొందిన విద్యార్థులను మరియు సంగీత ఉపాధ్యాయులు జితుమణి శర్మ , కిరణ్ కుమార్ లను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా ఇ.ప్రసాద రావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేష్, వియుయం. ప్రసాద్, వినోద్ రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హన్మంత రావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు భవానీ , రబీంద్ర పాత్రో, నిఖిత లు పాల్గొన్నారు.

# రాజన్న దర్శనంపై గందరగోళం

### అయోమయంలో భక్తులు

### ఉత్తర ద్వారం వద్ద భక్తుల నిరీక్షణ - ఎట్టకేలకు దర్శనభాగ్యం



**వేములవాడ, అక్టోబర్ 22(నినాదం):** ప్రముఖ పుణ్య క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు ఆలయ అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా దర్శనాలు నిలిపివేయడంతో భక్తుల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణలో భాగంగా ఆలయంలో భీమేశ్వరాలయంలో భక్తులకు తాత్కాలికంగా ఆర్జిత సేవలతో పాటు దర్శనాలకు ఆలయ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్రమంలో ప్రధాన ఆలయంలో రాజన్న దర్శనానికి భక్తులను అనుమతిస్తారా లేక నిలిపివేస్తారు అనే విషయంపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అటు భక్తుల్లో ఇటు పట్టణ ప్రజల్లో



అయోమయ పరిస్థితులు తలెత్తుతున్నాయి. శృంగేరి పీఠాధిపతిథి రాకతో దర్శనాలపై స్పష్టత వస్తుందని భావించినా కూడా ఎలాంటి అధికారిక ప్రకటనలు లేకపోవడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ప్రచార రథాన్ని ఆలయ తూర్పు భాగం రావి చెట్టు ముందర ఏర్పాటు చేసి తాత్కాలిక దర్శనాలకు భక్తులకు ప్రచార రథంలో అనుమతిస్తారంటూ ప్రచారం కొనసాగుతోంది. ఈ క్రమంలో సుదూర ప్రాంతాల నుండి నిత్యం స్వామి వారి దర్శనాలకు వస్తున్న భక్తులు ఎప్పటిలాగే ఉదయాన్నే స్నానాలు ఆచరించి రాజన్న దర్శనానికి ఆలయ ప్రాంగణానికి చేరుకుంటున్నారు. బుధవారం సైతం పలువురు భక్తులు ఆలయ ఉత్తర ద్వారం వద్దకు చేరుకోగా దర్శనానికి అనుమతివ్వకపోవడంతో గంటల తరబడి అక్కడే భక్తులు వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఇలవేల్పు రాజన్న ఆలయ అభివృద్ధి జరిగితే తమకూ సంతోషమేనని అయితే ఆలయంలో దర్శనాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు భక్తులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆలయంలో కోడె మొక్కు చెల్లించుకోవాలనుకున్న భక్తులకు నిరాశే ఎదురైంది. కోడెలను భీమేశ్వరాలయానికి తరలించడంతో కేవలం రాజన్నను దర్శించుకుని భక్తులు వెనుదిరిగారు. ఇదిలా ఉండగా దర్శనాల నిలిపివేత అవాస్తవమని, ఆలయంలో రేకుల షెడ్లు తొలగిస్తుండడంతో భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగకూడదనే ఉద్దేశ్యంతో కొంతసేపు మాత్రమే దర్శనాలు నిలిపివేశామని ఈవో రమాదేవి తెలిపినట్లు సమాచారం.




## జాతీయ స్థాయి సంగీత పోటీలలో సత్తాచాటిన పారమిత విద్యార్థులు

**కరీంనగర్, అక్టోబర్ 22(నినాదం):** ఇటీవల డ్రీమర్స్ డ్రీమ్, లక్నో వారి.ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి సంగీత పోటీలలో స్థానిక నగరం లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులు పొందారని పాఠశాల డైరెక్టర్ హనుమంత రావు తెలిపారు. ఈ పోటీల వాయిద్య సంగీత విభాగంలో 7వ తరగతికి చెందిన కిట్ల.చరణ్ జాతీయస్థాయి 7వ స్థానం , 6వ తరగతికి చెందిన ఎ.వి.కె. కార్తీక్ జాతీయస్థాయి 24వ స్థానం మరియు గాత్ర సంగీత విభాగంలో 8వ తరగతికి చెందిన సోనాక్షి సురేష్ జాతీయస్థాయిలో 17 వ స్థానం పొంది బహుమతులు, సర్టిఫికెట్స్ అందుకున్నాడు. జాతీయస్థాయిలో బహుమతులు పొందిన విద్యార్థులను మరియు సంగీత ఉపాధ్యాయులు జితుమణి శర్మ , కిరణ్ కుమార్ లను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా ఇ.ప్రసాద రావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేష్, వియుయం. ప్రసాద్, వినోద్ రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హన్మంత రావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు భవానీ , రబీంద్ర పాత్రో, నిఖిత లు పాల్గొన్నారు.




## జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్





### పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన...

### ఆసక్తిగా గమనించిన కాకతీయ విద్యార్థులు....

### సమాజానికి నిజమైన హీరోలు పోలీసులే: సిఐ రామకృష్ణ గౌడ్

**జమ్మికుంట, అక్టోబర్ 22 (నినాదం):** పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ సీపీ గౌస్ అలం ఆదేశాల మేరకు పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. కాకతీయ పాఠశాల విద్యార్థులు ఈ ఓపెన్ హౌస్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ రామ కృష్ణ గౌడ్ విద్యార్థులకు పోలీస్ లు ఏం చేస్తారు వారి విధులు అనే అంశాలపై విద్యార్థులకు తెలిపారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారులకు ఏ విధమైన సేవలు అందిస్తారో విద్యార్థులకు వివరంగా తెలిపారు. పోలీసుల కర్తవ్యాలు ఏ విధంగా ఉంటాయో వారికి అర్థమయ్యే రీతిలో సీఐ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ఎందుకు నిర్వహిస్తారు 100కు ఫోన్ చేస్తే పోలీసులు ఏ విధంగా స్పందిస్తారో అలాగే ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియను విద్యార్థులకు తెలిపారు. అంతేకాకుండా ఎఫ్ఐఆర్ అయినా కేసు పై విచారణ ఏ విధంగా చేపడతారో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ, పోలీసులు ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తారని సమయపాలన లేకుండా శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసులు నిరంతరం శ్రమిస్తారని తెలిపారు. నిజమైన హీరోలు పోలీసులని అలాంటి పోలీసులకు ప్రజలు సహకరిస్తే నేరాల నియంత్రణ సులభతరమవుతుందని ఎంతోమంది పోలీసులు తమ విధి నిర్వహణలో వీరమరణం పొందారని వారి జ్ఞాపకార్థంగానే పోలీస్ అమరవీరుల దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీ నుండి వారం రోజుల పాటు సంస్మరణ దినోత్సవాలు నిర్వహించుకుంటామని విద్యార్థులకు తెలిపారు. అనంతరం రిసెప్షన్ కౌంటర్ పనితీరు ఆయుధాల పనితీరును విద్యార్థులకు స్థానిక పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నాగరాజు హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి మహిళా కానిస్టేబుల్ మౌనిక తోపాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

### మాదక ద్రవ్యాల నియంత్రణకు "చైతన్యం"

### జిల్లా ఎస్పి రోహిత్ రాజు

### జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్22(నినాదం)** మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై ప్రజలలో అవగాహన కలపించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు.బుధవారం, ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచార వ్యూహాలు తదితర అంశాలపై చర్చ జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. జిల్లాలోని విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో వైద్యాధికారుల సహకారంతో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి, అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని, డీ-అడిక్షన్ సెంటర్ ద్వారా అవసరమైన చికిత్స అందించాలని తెలిపారు. ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచనలు జారీ చేయడం జరిగింది. ఇంటర్ కళాశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగ వల్ల కలిగే నష్టాలపై యువత, విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల అలవాట్లు, నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు.అదనంగా, యువతలో రక్తదానం అవగాహన కల్పించి రక్తదాన శిబిరాలు, మ్యూజిక్, డాన్స్, పరిశుభ్రత పై నెలకు ఒకసారి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ... జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చైతన్యం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం ద్వారా మా దగ్గర నియంత్రణకు కాటన్ సెర్చ్ లు, సైకిల్ ర్యాలీలు వంటి కార్యక్రమాలు నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను నష్టాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. తెలంగాణలో మొట్టమొదటిసారిగా మన దగ్గర రవాణా చేస్తూ పట్టుబడిన వారికి పి అండ్ పి ఎస్ నమోదు చేయడం జరుగుతుందని, రానున్న రెండు వారాల్లో ఇది అమలులోకి వస్తుందని తెలిపారు. మాదకద్రవ్యాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని అన్ని శాఖలు సమన్వయంతో మాదకద్రవ్యాలను నియంత్రణకు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఇల్లందు డిఎస్పి చంద్రబాను, ఇంటర్మీడియట్ అధికారి వేంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి జయలక్ష్మి, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు

దమ్మపేట, అక్టోబర్ 22(నినాదం): జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు ఎస్సై సాయి కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ నందు విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై చైతన్యం కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలు వాడకం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఇటువంటి వాటికి విద్యార్థుల దూరంగా ఉండాలని తెలిపారు. చదువుతోనే మంచి గుర్తింపు వస్తుందని ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హేచ్చరించారు. మండలాన్ని గంజాయి రహిత మండలంగా తీర్చి దిద్దే లక్ష్యంతో ఎస్పీ ఉత్తర్వుల ప్రకారం నెల రోజులు పాటు పలు గ్రామాలలో మాదకద్రవ్యాల నిర్మూలనకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్సై బాలస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్షం కారణంగా ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నల్లగొండ ప్రతినిధి అక్టోబర్ 22(నినాదం):** వర్షం కారణంగా ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె నల్గొండ మండలం, ముశ్రం పల్లి ,జికె అన్నారం గ్రామాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.రైతులు సరైన తేమ శాతంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొని వస్తే వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలన్నారు. ఒకవేళ తేమ, తాలు, తరుగు తదితర కారణాలవల్ల కొనుగోలు కేంద్రాలలో దాన్యం ఉండాల్సి వస్తే



వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు, ఇతర అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని చెప్పారు. ఎట్టి పరిస్థితులలో దాన్యం తడవకుండా చూసుకోవాలని, ఈ విషయంలో రైతులు సైతం



ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, రైతులు ధాన్యం వద్దే ఉండి తడవకుండా చూసుకోవాలని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ కనగల్ మండలం, పర్వతగిరి గ్రామంలోని వెంకట సాయి రైస్ మిల్లును తనిఖీ చేసి ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయాలని ,లోడింగ్ అన్లోడింగ్ లో జాప్యం చేయవద్దని వర్షం వస్తే ఇబ్బంది అవుతుందని అన్నారు .ఇక్కడ హమాలీల సంఖ్య తక్కువగా ఉన్నదని తెలుసుకొని తక్షణమే ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసి అన్లోడింగ్ చేయాలని ఆదేశించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్ ,నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, ధాన్యం సేకరణ నల్గొండ జిల్లా ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, కనగల్ తహసిల్దార్ పద్మ, తదితరులు ఉన్నారు.

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం — నిఖార్సైన జర్నలిజం

గురువారం 23 అక్టోబర్ 2025




## జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు

### బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి క్రిష్ణారెడ్డి

**కరీంనగర్, అక్టోబర్ 22(నినాదం):** మోడీ సర్కార్ తీసుకున్న జీఎస్టీ పన్నుల తగ్గింపుతో సబ్బులు పేస్టుల నుండి సిమెంట్ దాక టీవీల నుండి మోటార్ సైకిళ్ళు , కార్లు, ట్రాక్టర్ లు , వరి కోత మిషన్ల ధరలు తగ్గి అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు.బిజెపి చొప్పదండి పట్టణ అధ్యక్షులు చిల్ల శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు పలు వ్యాపార వాణిజ్య సంస్థలను సందర్శించి జీఎస్టీ అమలు తీరు తెన్నులను పరిశీలించారు.ఈ సందర్భంగా దుకాణాల నిర్వాహకులు జీఎస్టీ తగ్గింపుతో ప్రజలు దుకాణాలను సందర్శించడం పెరిగిందని , అమ్మకాలు మునుపటితో పోలిస్తే పెరిగాయని ధరలు తగ్గడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలియజేశారు.ఒక్కో సిమెంట్ బస్తా పై 20 నుంచి 30 రూపాయలు తగ్గినట్టు చాకుంటకు చెందిన సిమెంట్ వినియోగదారుడు ఏముండ మల్లేశం 150 సీసీ స్కూటర్ కొనుగోలు పై జి ఏస్ టి తగ్గింపు తో పదివేల రూపాయలు తగ్గిందని నూతన స్కూటర్ కొనుగోలు చేస్తున్న అనుమాండ్ల చంద్రమౌళి నిత్యావసర సరకులపై నెలకు ఐదు వందల నుండి నుండి వేయి రూపాయలు ఆదా అవుతున్నాయని కిరాణా వినియోగదారుడు హరి ప్రసాద్ లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిఎస్టి తగ్గింపు తో లబ్ధి పొందుతున్న వినియోగదారులకు బిజెపి నాయకులు మిఠాయి తినిపించి శాలువా కప్పి సన్మానించారు. జీఎస్ టి లాభాలు ప్రజలకు అందిస్తున్నందుకు దుకాణాల నిర్వాహకులను సింగిరెడ్డి కృష్ణారెడ్డి అభినందించారు. జి ఏస్ టి చట్టాలు కఠినంగా ఉన్నందున జి ఏస్ టి లాభాలు ప్రజలకు ఖచ్చితంగా అందించ వలసిన బాధ్యత వ్యాపారులు తీసుకోవాలని ఈ సందర్భంగా సింగిరెడ్డి కృష్ణారెడ్డి వాణిజ్య సంస్థలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్లాపూర్ ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణ, బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, బిజెపి చొప్పదండి రూరల్ శాఖ అధ్యక్షులు మొగిలి మహేష్, గుండేటి శివ,జిట్ట కుమార్,తాడూరి రామకృష్ణ,గుండె వెంకటేష్ ,అర్ధవెల్లి శ్రీను,స్వర్గం కళ్యాణ్, గుజ్జేటి శ్రీకాంత్, పెద్ది సాగర్, బొడిగె శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



## అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా నామినేషన్ దాఖలు చేసిన లింగంపల్లి సత్యనారాయణ

**కరీంనగర్,అక్టోబర్ 22(నినాదం):** ది కరీంనగర్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ గా లింగంపల్లి సత్యనారాయణ బుధవారం రోజున నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు.ఈ సందర్భంగా లింగంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, ది కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ గా నిరుద్యోగ యువతగా, బ్యాంక్ అభివృద్ధి కొరకు ఈరోజు నేను నామినేషన్ వేయడం జరిగిందన్నారు.కరీంనగర్, జగిత్యాల ఓటర్లు వారి అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ది కరీంనగర్ కో-పరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ గా లింగంపల్లి సత్యనారాయణ ను బలపరిచిన సభ్యులు చంద్రం పటేల్, జాతీయ బిసి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అది మల్లేశం పటేల్, బిషన్ సింగ్, చారి తదితరులు పాల్గొన్నారు.




## మా భూముల మాకే కావాలి

### దేవుని పేరుతో జీవనోపాధి భూములు లాక్కోవడం అన్యాయం

### ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ వైఖరి మార్చుకోవాలి

### బలవంతంగా భూములు లాక్కుంటే మాకు సావే చరణ్యం

### విలేకరుల సమావేశంలో ఖమ్మం 15వ డివిజన్ అల్లిపురం దళిత రైతుల ఆవేదన

**ఖమ్మం, అక్టోబర్ 22 (నినాదం):** మా భూములు మాకే కావాలని, జీవనోపాధితో పాటు పిల్లల చదువుకు ఉపయోగపడుతున్న భూములను దేవుని ఆలయం పేరుతో బలవంతంగా లాక్కోవటం సరైంది కాదని ఖమ్మం అర్బన్, దంసలాపురం రెవిన్యూ, 15వ డివిజన్ అల్లిపురంకు చెందిన దళిత రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళితులు మాట్లాడుతూ... ఖమ్మం అర్బన్ ధంసలాపురం రెవెన్యూ అల్లిపురం 15వ డివిజన్లోని సర్వే నెంబర్ 408 లో 15 ఎకరాల భూమిని వారసత్వంగా 12 మంది దళిత రైతులు సాగు చేసుకుంటున్నామన్నారు. పేద, అణగారిన దళిత వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం గత 60 సంవత్సరాల క్రితం భూమిలేని నిరుపేదలకు భూములను కేటాయించిందని, వారసత్వంగా వస్తున్న ఆ భూములకు పట్టా, పాస్ పుస్తకాలు కూడా ప్రభుత్వం కేటాయించిందని తెలియజేశారు. అట్టి భూమి తప్ప మాకు వేరే భూమి లేదన్నారు. వారసత్వంగా ఆ భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధితో పాటు పిల్లలను చదివించుకుంటున్నామని అన్నారు. తిరుమల తిరుపతి దేవాలయం పేరుతో సాగు చేసుకుంటున్న మా భూములను స్థానిక ప్రజా ప్రతినిధులు లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ వైఖరిని మార్చుకొని దళితుల అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. సాగు చేసుకుంటున్న మా భూములను బలవంతంగా లాక్కుంటే మాకు సావే చరణ్యం అని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విలేకరుల సమావేశంలో గద్దల రాంబాబు, గద్దల వెంకటరమణ, కొండ అమేల్యమ్మ, బర్ల రవి, బర్ల ఫ్రాన్సిస్, జొన్నలగడ్డ లలిత, ఆమదాల రోజమ్మ బర్ల కోటేష్, షేక్ మీరాబి, మద్దె పుల్లమ్మ, పి లలితమ్మ, గొర్రెముచ్చు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో రోడ్డు భద్రత ప్రణాళికకు నూతన రూపం

### పట్టణాలలో ప్రధాన రోడ్ల గుంతలను పూడ్చి వేయాలి

### పాఠశాలల వద్ద స్కూల్ జోన్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు

### ప్రమాదాల నియంత్రణకు ఎన్.హెచ్. పై బ్లాక్ స్పాట్స్ గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి

### కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి

### 8వ జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, పోలీస్ కమిషనర్




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 22:(నినాదం):** రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 8వ జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో స్థానిక మున్సిపాలిటీలు బాధ్యతలు తీసుకొని రోడ్ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఖమ్మం నగరంలో 10 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి రోడ్ల గుంతలను పూడ్చి వేయడం జరిగిందని తెలిపారు.రోడ్ల గుంతలు పూడ్చివేత నాణ్యతతో జరగాలని, సాంకేతిక విలువను తూ.చ. తప్పకుండా పాటించాలని అన్నారు.కల్లూరు, వైరా, సతుపల్లి, మధిర, ఏదులాపురం మున్సిపా లిటీల పరిధిలో ప్రధాన రోడ్లపై ఉన్న గుంతలను గుర్తించి 15 రోజులలో వాటిని పూడ్చి వేయాలని కలెక్టర్ ఆదేశించారు.నేషనల్ హైవే 365బిబి ఖమ్మం నగరానికి బైపాస్ సెక్షన్ గా ఉంటుందని, ఖమ్మం బైపాస్ వద్ద మరమ్మత్తు పనులు చేపట్టాలని, అక్కడ రోడ్డు భద్రత ప్రమాణాల క్రింద రంబుల్ స్ట్రిప్స్, రేడియం స్టిక్కర్, స్పీడ్ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు.జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి అక్కడ ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. నేషనల్ హైవే పై ఉన్న జంక్షన్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట వాహనాల వేగాన్ని నియంత్రిం చేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఖమ్మం -కోదాడ, వరంగల్ జంక్షన్ పరిధిలో ఉన్న స్ట్రెచ్ ను ఆర్ అండ్ బీ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు.వైరా లో ఒక అపార్ట్ మెంట్ రోడ్డుపై సివరేజి వదలడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవు తున్నాయని తెలుసుకున్న కలెక్టర్ వెంటనే సంబంధిత యాజమాన్యాలకు నోటీస్ జారీ చేయాలని, 15 రోజులలో అక్కడ యాజమాన్యం సొంత డబ్బులతో ఇంకుడు గుంత నిర్మించి, రోడ్డుపై సీవరేజి రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

మున్సిపల్, ఎన్.హెచ్, రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్ బీ అధికారులు సంయుక్తంగా అక్టోబర్ 24న బైపాస్ నుంచి కలెక్టరేట్ వరకు ఫీల్డ్ విజిట్ చేపట్టి తీసుకోవాల్సిన చర్యలపై అక్టోబర్ 29 నాటికి రిపోర్ట్ అందించాలని కలెక్టర్ ఆదేశించారు.పట్టణ ప్రాంతాలలో పాఠశాలల వద్ద ఉన్న రోడ్లపై స్కూల్ జోన్, గో స్లో రేడియం స్టిక్కర్లతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని,రోడ్లపై వాహనాల వేగం తగ్గించేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పాఠశాల గేట్ వద్ద వారి సిబ్బంది ఉంటూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేయాలని అన్నారు.నగరంలో ఉన్న బస్ బే లను ఆడిట్ చేసి పాదచారులకు ఉపయోగకరంగా తయారు చేయాలని అన్నారు. నగరంలో వాణిజ్య వ్యాపార సంస్థలను తనిఖీ చేసి అక్కడ ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతను వారికి అప్పగించాలని సూచించారు.

ఏఐ సాంకేతికతను వాడుతూ రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన సంఘటనలు గుర్తించి వారికి చట్టం ప్రకారం జరిమానాలు విధించాలని, ట్రాఫిక్ నిబంధనలు, ఏఐ సాంకేతిక వినియోగం పట్ల విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ తెలిపారు.

జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లను బలోపేతం చేయడానికి అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో గోల్డెన్ అవర్ లో అవసరమైన చికిత్స వెంటనే అందించి మనుషుల ప్రాణాల సంరక్షణకు చర్యలు చేపట్టాలని అన్నారు.

నేషనల్ హైవే పై ఉన్న జంక్షన్ వద్ద హై మాస్ లైట్లు తప్పకుండా వెలగాలని, నగర ప్రాంతంలో ఎక్కడ డార్క్ స్పాట్ ఉండడానికి వీలు లేదని అన్నారు రోడ్లపై ఎక్కడ భారీ వాహనాలు పార్కింగ్ చేయడానికి వీలు లేదని,దీనికి సంబంధించి లారీ డ్రైవర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ రవాణా అధికారినీ ఆదేశించారు.

దానవాయిగూడెం రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభం కాకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మత్తు పనులు వెంటనే స్టార్ట్ చేసి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. భారీ వాహనాల వల్ల జిల్లాలో 18 చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని, వీటిలో మొదటి దశలో 5 రోడ్ల మరమ్మత్తు పనులు చేపట్టుటకు ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు.హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, జిల్లాలో 17 హిట్ అండ్ రన్ కేసులు జరిగాయని, వీరికి బీమా ప్రకారం పరిహారం అందేలా చూడాలని, మన దగ్గర ఎక్కడ పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు.పోలీసు కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ఎన్.హెచ్. కనెక్టింగ్ రోడ్డు, టీ-జంక్షన్ వద్ద ఎన్.హెచ్. తరపున రంబుల్ స్ట్రిప్స్, ఆర్ అండ్ బి/ పంచాయతీ రోడ్ల పై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో పార్కింగ్ లేకుండా నూతన పాఠశాలలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇవ్వవద్దని అన్నారు. ప్రతి ప్రైవేట్ పాఠశాల పార్కింగ్ స్పేస్ గుర్తించాలని లేని పక్షంలో భవిష్యత్తులో అనుమతుల రెన్యువల్ నిలిపివేయాలని అన్నారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజమాట్లాడుతూ నేషనల్ హైవే వద్ద జరిగిన ప్రమాదాల దృష్ట్యా బ్లాక్ స్పాట్స్ గుర్తించి వాటి సమీపంలో గల ఆసుపత్రు లకు మ్యాచ్ చేయాలని, అక్కడ ట్రామా సెంటర్ ప్రాథమిక సేవలు అందేలా చూడాలని అన్నారు. ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ వర్షాల అనంతరం నగర కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్లపై ఏర్పడిన 470 గుంతలను గుర్తించి ఇప్పటి



వరకు 350 పూడ్చి వేత పూర్తి చేశామని అన్నారు. 6 ప్యాకేజి లలో టెండర్లు ఫైనల్ చేసి పనులు చేపట్టామని, కోల్డ్ మిక్స్ సాంకేతికతో తాత్కాలికంగా రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేశామని అన్నారు.

నగరంలోని 16 కిలోమీటర్లు ప్రధాన రోడ్లలో నేషనల్ హైవే తరహాలో లైన్ మార్కింగ్ , జిబ్రా క్రాసింగ్ వేయడం జరుగుతుందని, దీనికి టెండర్లు పిలిచామని రెండు నెలల్లో ఈ పని పూర్తి చేస్తామని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, విద్యా సంస్థల సమీపంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నామని ఫుట్ పాత్ పై పాదచారులు ప్రయాణించేలా సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు.

ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. ఏ. పద్మశ్రీ, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. కళావతి బాయి, జిల్లా రవాణా అధికారి వెంకట రమణ, నేషనల్ హై వే పిడి లు రామాంజనేయ రెడ్డి, దివ్య,ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, ఆర్టీఓ,పోలీసు, మునిసిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## పత్రికా కార్యాలయాలపై దాడులు అమానుషం

### బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి...

### టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపూరావు



**జమ్మికుంట అక్టోబర్ 22 (నినాదం):** నమస్తే తెలంగాణ దినపత్రిక వరంగల్ యూనిట్ కార్యాలయంపై దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు (టీడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపూరావు అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా, ప్రజాప్రతినిధి అయినా ప్రజాస్వామ్యంలో నాలుగోస్థంభంగా ఉన్న మీడియాపై బెదిరింపులకు దిగటం సరికాదన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై వార్తలు రాసే స్వేచ్ఛ పత్రికలకు ఉంటుందని, పేపర్లలో తమకు వ్యతిరేక వార్తలు వస్తే, వాటికి ఖండనలు ఇవ్వటం, వివరణలు ఇవ్వటం చేయాలి కానీ బెదిరింపులకు పాల్పడటం, భౌతిక దాడులకు దిగటానికి ప్రజాస్వామ్యంలో చోటులేదన్నారు. భావప్రకటనా స్వేచ్ఛ పై దాడి సరికాదని, తక్షణమే పత్రికా కార్యాలయంపై దాడికి దిగిన వారిని అరెస్టు చేసి, దాడికి ఉసిగొల్పిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.


## రైల్వే స్టేషన్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి




**జమ్మికుంట, అక్టోబర్ 22 (నినాదం):** జమ్మికుంట పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ పై గుర్తుతెలియని(70) సంవత్సరాల వ్యక్తి అనారోగ్యంతో కిందపడి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. మృతుడు లేత ఆకుపచ్చ రంగు టీ షర్ట్ ధరించి తెలుపుదోతి ధరించినట్లు పేర్కొన్నారు. సంబంధించి ఎలాంటి గుర్తింపు కార్డులు కానీ , వివరాలు కానీ తెలియకపోవడంతో జమ్మికుంట ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలియజేశారు. వివరాలు తెలిసినవారు.

## సమయపాలన పాటించని తహసిల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

### సిపిఎం పార్టీ మండల కార్యదర్శి చెల్పూరి రాము





**జమ్మికుంట, అక్టోబర్ 22 (నినాదం):** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇల్లందకుంట మండల తాహసిల్దార్ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి చెల్పూరి రాము ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, ఇల్లందకుంట మండల తాసిల్దార్ మధ్యాహ్నం 12 గంటలు దాటుతున్న సమయానికి రావడంలేదని ఆయన రాక కోసం ఎంతో మంది రైతులు ప్రజలు ఎదురుచూస్తూ ఇబ్బందులకు గురవుతున్నారని రాము పేర్కొన్నారు. ప్రతిరోజు ఇదే విధంగా సమయపాలన పాటించకుండా తహసీల్దార్ వ్యవహరిస్తున్నాడని ఆయన అన్నారు. కార్యాలయానికి ఎప్పుడు వచ్చిన మమ్ములను అడిగే వారు లేరు అనే విధంగా తన ఇష్టం వచ్చినట్టు టైం కు వస్తూ తాహసిల్దార్ తీరు ఉందని ఆఫీస్ కు వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి చూస్తూ ఇబ్బందులకు గురి అవుతున్నారు అని అన్నారు. రిజిస్ట్రేషన్స్ ఉంటే ఉదయాన్నే వస్తున్నారు. రిజిస్ట్రేషన్ లేకుంటే ఆఫీసుకు ఎప్పుడొస్తారో ఎప్పుడు పోతారు అంతా తన ఇష్టమని అన్నారు. విధుల పట్ల ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తాహసిల్దార్‌పై ఉన్నత అధికారులు స్పందించి శాఖపరమైన చట్టపురమైన చర్యలు తీసుకోవాలని లేనియెడల జిల్లా కలెక్టర్ కి ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా రాము తెలిపారు.

**గ్రామ సందర్శనకు వెళ్లాను తహసిల్దార్...**

ఈ విషయంపై తహసిల్దార్ రాజమల్లును వివరణ కోరగా భూభారతి సమస్యలపై పరిష్కారం కోసం మండలంలోని టేకుర్తి గ్రామానికి వెళ్లానని ఎప్పుడు కూడా కార్యాలయానికి లేటుగా రాలేదని ఆర్డీవో కార్యాలయంలో గాని కలెక్టర్ కార్యాలయంలో గాని సమావేశం ఉన్నప్పుడు మాత్రమే కార్యాలయానికి రేటుగా వచ్చానని ఉదయం పూట గ్రామీణ ప్రాంతాలలో తిరగాల్సిన పని ఉన్నప్పుడు ఆ పని చూసుకొని కార్యాలయానికి వస్తామని తహసిల్దార్ పేర్కొన్నారు.

## అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా నామినేషన్ వేసిన గడ్డం విలాస్ రెడ్డి

**కరీంనగర్, అక్టోబర్ 22 (నినాదం):** ది కరీంనగర్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ గా మాజీ ఇంచార్జి చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి బుధవారం రోజున నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు.ఈ సందర్భంగా విలాస్ రెడ్డి మాట్లాడుతూ, ది కరీంనగర్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ గా తన 12 మంది ప్యానల్ సభ్యులతో కలసి నామినేషన్ వేయడం జరిగింది.కరీంనగర్ , జగిత్యాల ఓటర్లు వారి అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నేను కాంగ్రెస్ కార్యకర్తగా 35సంవత్సరాలనుండి పని చేస్తున్నాని ఈ ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరిగిన, ఒక వేల కాంగ్రెస్ పార్టీ మద్దతూ ఇవ్వవలసి వస్తే మా ప్యానల్ కే మంత్రి పొన్నం, ప్రభుత్వం ఆసిస్సులు ఉంటాయి అన్నారు. గత పాలకులు బ్యాంక్ ను 10



సంవత్సరాలు భ్రష్టు పట్టించారాని మా ఇంచార్జి పాలన 15 నెలల లో బ్యాంక్ అభివృద్ధి కొరకు గంగాధర లో నూతన బ్రాంచ్ ఏర్పాటు చేశామని, రెండు సార్లు సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చెసి డిపాజిట్లు పెంచమని, మళ్ళీ మా ప్యానల్ ను ఓటర్లు ఆశీర్వదించి గెల్పిస్తే బ్యాంకు ముందర స్థలం తో బ్యాంక్ ను విస్తరిస్తానని, జమ్మికుంట లో నూతన బ్రాంచ్ కొరకు ఆర్బిఐ అనుమాతితో నూతన బ్రాంచ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఓటర్ల ఆశీస్సులు మా ప్యానల్ పై ఉండాలని మనస్పూర్తిగా వేడుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో ది కరీంనగర్ కో-పరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ గా బలపరిచిన సభ్యులు విలాస్ రెడ్డి ప్యానల్ సభ్యులు ముదుపు మోహన్, నాగుల సతీష్, ఎలగందుల మునిందర్, మహమ్మద్ ఖలీల్ ఖాన్, గాలిపెల్లి గౌరయ్య, మూల కృష్ణ రెడ్డి, కూడిక్యాల లక్ష్మి, కూసేరి అనిల్ కుమార్, మంగి రవీందర్, కాంజర్ల రేణుక, అల్లు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన కరీంనగర్ సిపి

**జమ్మికుంట, అక్టోబర్ 22 (నినాదం):** కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ మంగళవారం హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కమీషనర్ గౌష్ ఆలం పోలీస్ స్టేషన్ పరిసరాలను, ఆవరణలోని స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడి, రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్ లో నమోదైన కేసుల వివరాలను సక్రమంగా పొందుపరచాలని వారికి సూచించారు.తెలంగాణ పోలీసులు వినియోగించే సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఈ-సమన్ల జారీ, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక, ఆర్థికేతర నేరాలు, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ వార్న్ కెమెరాలు వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలని



అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఎఫ్.ఐ.ఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష జరిపి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నమోదైన సైబర్ నేరాల గురించి తెలుసుకొని, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. హుజురాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను సెక్టార్లుగా, సబ్-సెక్టార్లుగా విభజించి, వాటికి గ్రామాల వారీగా పోలీస్ అధికారులను కేటాయించాలని ఆదేశించారు.నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు పోలీస్ స్టేషన్‌లో అన్ని రకాల విధులను, రికార్డు నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్లు వంటి విధులను సీనియర్ల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.అలాగే, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెలా వారికి సంబంధించిన నూతన సమాచారం సేకరించి నమోదు చేసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ వి మాధవి, ఇన్స్పెక్టర్ కరుణాకర్ లతో పాటు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
గురువారం 23 అక్టోబర్ 2025

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొమురం భీం జయంతి




**సిద్దిపేట ప్రతినిధి సెప్టెంబర్ 22 : (నినాదం):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా కొమురం భీమ్ జయంతి వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కుటుంభ ప్రబోధన్ సంయోజక్ చంద్రశేఖర్ గాందే మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజనుల పోరాటాల స్థానం ఎంతో కీలకమైనది. ఆదివాసీల ఉత్కంఠ, ప్రగతి కోసం చేసిన పోరాటాలు, కొన్ని శతాబ్దాల కాలం గడిచినా, అధికారిక చరిత్రలో ఎక్కువగా చోటు పొందలేకపోయాయి. అయితే, తెలంగాణలో కొమరం భీమ్ జీవితం, అతని తత్వం, ఆయన నినాదం, ఈ గిరిజనుల పోరాటానికి శాశ్వత చిహ్నంగా నిలిచింది. ఆయన మాటల్లో "జల్, జంగిల్, జమీన్" అనే మాటలు గిరిజనుల హక్కుల, స్వాభిమానాన్ని ప్రతిబింబిస్తాయి. అన్నారు. 1901 లో అక్టోబర్ 22 రోజున ఆదిలాబాద్ జిల్లా (ప్రస్తుత కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా) లోని సంకెపల్లి గ్రామం లో గోండు తెగకు చెందిన తండ్రి కొమరం చిన్నూ, తల్లి సొంబాయి దంపతులకి కొమరం భీమ్,జన్మించిన అతని బాల్యం పేదరికం, సామాజిక అన్యాయంతో నిండింది. తన కుటుంబం, ఇతర గిరిజనులు నిరంతర అణచివేతకు గురవుతుండగా, భీమ్ ఈ అసహ్యమైన పరిస్థితుల్ని ఎదుర్కొనసాగాడు. నిజాం పాలనలో అడవి అధికారులు, జమీందార్లు గిరిజనులపై తీవ్ర పీడన కొనసాగించారు. అధికారుల వలన తండ్రి మరణం భీమ్ మనసులో తిరుగుబాటు ఆవేశాన్ని రగిలించిందిబీ అక్కడి నుంచే ఆయన ప్రజా పోరాటం ప్రారంభమైంది." అన్నారు. భీమ్ జీవితం, 21వ శతాబ్దంలో ప్రతి యువతకు మార్గదర్శకం కావాలి. మనం పర్యావరణ మార్పులతో, మౌలిక హక్కుల లేమితో బాధపడుతున్న ఈ కాలంలో, కొమరం భీమ్ నినాదం మరింత ప్రాసంగికంగా మారింది. ఆయన పోరాటం కేవలం గిరిజనుల హక్కుల కోసం మాత్రమే కాదు, మన అందరి భవిష్యత్తు కోసం. "జల్, జంగిల్, జమీన్" అనే నినాదం నేటి యువతకు మార్గదర్శకం కావాలని వారు అన్నారుఈ కార్యక్రమం లో కళాశాల కామర్స్ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ గోపాల శుదర్శనం గారు,ఏబీవీపీ రాష్ట్ర వనవాషి కో కన్వీనర్ పరశురామ్, కళాశాల అధ్యక్షులు భాను ప్రసాద్, మహిళా ఇంచార్జ్ అక్షయ,జోనల్ ఇంచార్జ అనీష్, లోకేష్,కార్యవర్గ సభ్యులు చందు, ధనుష్, భరత్,హర్ష, విద్యార్థులు పాల్గొన్నారు

## గాలి మాటలతో ఎంతకాలం మోసం

**-మాటలు ఘనం..పాలన ఆచరణలో శూన్యం**

**-మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**

**హైదరాబాద్,అక్టోబర్22(నినాదం):** రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనలు ఘనంగా ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం శూన్యం అని ఆయన అన్నారు. గాలి మాటలతో ప్రజలను ఎంతకాలం మోసం చేస్తారని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం నియమించిన స్కావెంజర్లకు 9 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం సిగ్గుమాలిన చర్య అని హరీష్ రావు పేర్కొన్నారు. చిన్న ఉద్యోగుల శ్రమను, కష్టాన్ని గౌరవించడం సర్కార్‌కు ఎందుకు సాధ్యం కాకపోతుందో విమర్శించారు. అలాగే, కాంగ్రెస్ పాలనలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు బెనిఫిట్స్ కోసం, స్కావెంజర్లు వేతనాల కోసం నెలలుగా ఎదురుచూస్తూ నరకయాతన అనుభవిస్తున్నారని హరీష్ రావు తెలిపారు. ఈ పరిస్థితి ద్వారా ప్రజలకు సేవలందించిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కులు మానసికంగా హానికరంగా ఎదురవుతున్నాయని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం కూడా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉన్నదని ఆయన విమర్శించారు. 'కేసీఆర్ ప్రారంభించిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం నిలిపివేయబడింది. మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించకుండా, అమలు గాలికి వదిలివేశారు. మీ సొంత శాఖలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతన సమస్యలు కనిపించడం లేదా?' అని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి, ఆచరణలో గాలి మాటలకు గురి చేస్తే ఉద్యోగులను మోసం చేయడం అనైతికమని పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం నెలలుగా ఎదురుచూస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆవేదన వింటే మనస్సు చెలించిపోతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

### సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను

## సమర్పించిన ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, అక్టోబర్ 22(నినాదం):** తన నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఎంతో మంది పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించే దిశగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక చొరవ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయం సెక్రటేరియట్ లో ముఖ్యమంత్రి సహాయనిధి కోసం స్వీకరించిన 120 దరఖాస్తులను బుధవారం సంబంధిత అధికారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి కుటుంబం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఉపశమనాన్ని పొందేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా వైద్య చికిత్స అవసరం ఉన్న అర్హత కలిగిన ప్రతి కుటుంబం తమ వివరాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి అందజేయాలని వారికి ప్రభుత్వ నుంచి ఉచితంగా వైద్య సహాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**మహేశ్వరం, అక్టోబర్ 22 (నినాదం ) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం గ్రామపంచాయతీ మైసిగండి గ్రామానికి చెందిన కేతావత్ లక్ష్మ ణ్ నాయక్ అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న టిఆర్ఎస్ పార్టీ గ్రామపంచాయతీ మా జీ సర్పంచ్ రామావత్ తులసిరామ్ నాయక్ మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని మైసిగండి స్థానిక నాయకులతో కలిసి మృతుడి కుటుంబా సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు చందన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలే

**- సీఐ నాగార్జునరావు**




**మహాముత్తారం, అక్టోబర్ 22(నినాదం):** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కాటారం సీఐ నాగార్జునరావు అన్నారు. బుధవారం మహాముత్తారం మండలం కోనంపేట గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి వారి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రజలు తమ సహకారాన్ని పోలీస్ శాఖకు అందించాలని కోరారు. గ్రామాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు అపరిచయ వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రత గురించి సీసీ కెమెరాల ఉపయోగాలు, గుడుంబా గంజాయి, గుట్కా సేవించడం వల్ల వచ్చేఅనారోగ్యాలు, ఇబ్బందుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్డెన్‌సెర్చ్ లో సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కాటారం కొయ్యూరు ఎస్సై వి నరేష్,మహాముత్తారం ఎస్సై మహేష్, ఆర్ఎస్ఐ ఫిరోజ్, సివిల్, డిస్టిక్ స్పెషల్ పార్టీ సిబ్బంది, టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యంగ్య చిత్రకారులలో సాటి లేని మేటి ఆర్. కె.లక్ష్మణ్

### అక్టోబర్ 23...ఆర్. కె.లక్ష్మణ్ జయంతి

కార్టూన్ రంగ చరిత్రలో అనేక పాత్రలు సృష్టించ బడినా, ఆర్.కె.లక్ష్మణ్ సృష్టించిన సామాన్య మానవుడు (కామన్ మాన్) అనితర సాధ్యమైన ప్రాచుర్యం పొందడం విశేషం. లక్ష్మణ్ వేసిన దాదాపు అన్ని రాజకీయ వ్యంగ్య చిత్రాలలో కూడా ఆయన విశేష ఊహా చిత్రమైన సామాన్య మానవుడు దర్శనమిస్తాడు. బట్టతల, కళ్ళజోడు, గళ్ళకోటుతో ఉండే వ్యక్తి ప్రధానమంత్రి కార్యాలయం నుండి, గ్రామ కార్యాలయం వరకూ అన్ని చోట్ల దర్శనమిస్తూ, అక్కడ జరుగుతున్న విచిత్ర విషయాలకు సాక్షిగా నిలుస్తూ, చక్కటి హావ భావ ప్రకటన మాత్రమే చేస్తూ, ఎన్నడూ ఒక్క మాటకూడ మాట్లాడక పోవడం గమనార్హం. ఈ సామాన్య వ్యక్తి కార్టూన్ పాత్ర ఎంత ప్రసిద్ధి చెందిందంటే, ముంబాయిలో వర్లీ సముద్ర తీరంలో, సామాన్య వ్యక్తికి ఒక లోహ విగ్రహం ప్రతిష్ఠించారు. భారతదేశంలో ఒక కార్టూన్ పాత్రకు ఒక విగ్రహం ఉండటం ఇదొక్కచోట మాత్రమే కావడం విశేషాల్లోకి విశేషం. ఆర్.కె.లక్ష్మణ్ గా లబ్ధ ప్రతిష్టులైన రాశిపురం కృష్ణస్వామి అయ్యర్ లక్ష్మణ్ (అక్టోబర్ 23 1924 – జనవరి 26 2015) భారత దేశంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న వ్యంగ్య చిత్రకారులలో ఒకరు. ముంబాయి నుండి ప్రచురించ బడే ఆంగ్ల దిన పత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా లో ప్రతిరోజూ వ్యంగ్య చిత్రాలు వేస్తూ ఉండేవారు. కొన్ని దశాబ్దాలనుండి ఒకే వార్తా పత్రికలో పనిచేస్తూ, తన కార్టూన్లకు ఒక ప్రత్యేకతను సంతరించు కున్నారు. ఆయన ముఖ్యంగా రాజకీయ వ్యంగ్య చిత్రాలను వేస్తూ ఉండేవారు. లక్ష్మణ్ సృష్టించిన సామాన్య వ్యక్తి పాత్ర కార్టూన్ల చరిత్రలో అత్యంత పేరు తెచ్చుకున్న పాత్ర. రాజకీయ కార్టూన్లు వేసి భారత దేశంలో ఉన్న రాజకీయ నాయకులందరినీ ఆటపట్టించి, వారిమీద సద్విమర్శలు చేసి రాజకీయ రంగాన్ని సరైన పంథాలో నడిపించటానికి తనవంతు కృషి చేసిన ఘనత ఆయనకే దక్కింది.

# సౌభ్రాతృత్వానికి ప్రతిరూపం... భగినీ హస్త భోజనం

**యమ ద్వితీయ సందర్భంగా**

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతిరూపం భగినీ హస్త భోజనం. సౌభ్రాతృత్వానికి ప్రతీకగా అందరికీ ముందుగా గుర్తుకు వచ్చేది రక్షాబంధనం. కానీ, ఇంతటి ప్రాముఖ్యత పొందిన మరో పర్వదినాన్ని కూడా అన్నా చెల్లెళ్ల పండగగా జరుపుకొంటాం... అదే భగిని హస్త భోజనం. భగిని' అంటే... చెల్లెలు లేదా అక్క ఎవరైనా కావచ్చు. 'హస్త భోజనం' అంటే... చేతి భోజనము అని అర్థం. అంటే.. సోదరి చేతి వంట సోదరుడు తినడం అన్నమాటఈ రోజున అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ముల్ని ఇంటికి పిలిచి భోజనం పెట్టి, వారు ఎల్లప్పుడూ బాగుండాలని పూజలు చేస్తారు. దీనినే భగిని హస్త భోజనం అంటారు. స్మృతికౌస్తుభం దీన్ని యమ ద్వితీయగానే ప్రకటించింది. సోదరుడిపట్ల సోదరి ప్రేమకు ప్రతీకగా– దీన్ని 'భ్రాతృవిదియ'గా పరిగణించడమూ పరిపాటి అయింది. చతుర్వర్గ చింతామణి సహా అనేక గ్రంథాల్లో దీని ప్రస్తావన వస్తుంది. ఆమె చేతివంటకు ప్రత్యేకతను, పవిత్రతను ఆపాదిస్తూ 'భగినీ హస్తాన్న భోజనం' అని పిలవడం లోకంలో సంప్రదాయంగా స్థిరపడింది. భాతృ విదియ ఒక హిందువుల పండుగ. దీనిని కార్తీకమాసము నందు కార్తీక శుద్ధ ద్వితీయ రోజున జరుపు కుంటారు. మహారాష్ట్రలో ఈ పండుగను 'భయ్యా–దుజ్' అని పిలుస్తారు. నేపాల్ ప్రాంతంలో ఈ పండుగను 'భాయి–టికా' అని పిలుస్తారు. పంజాబ్ ప్రాతంలో ఈ పండుగను 'టిక్కా' అని పిలుస్తారు. దీపావళి అయినాక రెండో రోజు దీనిని చేసుకుంటారు. ఈ రోజున సోదరులను ఇంటికి పిలిచి వారి నుదుట బొట్టు పెట్టి, హారతి ఇచ్చి, మిఠాయిలు తినిపించి, ఇష్టమైన పిండి వంటలతో భోజనం పెట్టి తమ సోదరులు ఆరోగ్యంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తారు.సూర్య భగవానుని కుమారుడు యముడు. ఆయన సోదరి యమి/ యమున. యమునా నది. యమున తన అన్న యమునిని, తన ఇంటికి రమ్మని చాలాసార్లు కోరుకుంది. తీరిక చిక్కని విధి నిర్వహణ మూలంగా ఆమె కోర్కె తీర్చలేక పోతాడు. తుదకు యముడు



ఒకనాడు యమున యింటికి వెళ్తాడు. ఆనాడు కార్తీక శుక్ల విదియ. సపరివారంగా వచ్చిన సోదరుని ఆమె ఎంతో మర్యాద చేసింది. యమున్ని ఆయన ముఖ్య లేఖకుడైన చిత్రగుప్తుని, వారి దూతలను పూజించింది. స్వయంగా వంటచేసి అందరికీ వడ్డించింది. ఆమె చేసిన మర్యాదలకు సంతృప్తుడైన యముడు చెల్లెలికి ఏదైనా వరం కోరుకో మంటాడు. దానికి ఆమె ఈ రోజున చెల్లెలి ఇంటికి వెళ్ళి చెల్లెలి చేతి వంట తినే సోదరునికి నరకాలోక ప్రాప్తి, అపమృత్యుదోషం లేకుండా వరం ప్రసాదించమని కోరింది. ఆమె కోరిన వరాన్ని ప్రసాదిస్తూ యముడు ఎవరైతే ఈనాడు సోదరుని తన ఇంటికి ఆహ్వానించి తన చేతివంటకాల్ని వడ్డించి తినిపిస్తుందో ఆమె వైధవ్యాన్ని పొందక చిరకాలము పుణ్యస్త్రీగా వుంటుందని కూడా వరమిచ్చారు. ఈ విధంగా దీపావళి తరవాత వచ్చే రెండో రోజుని భగిని హస్తభోజనం పర్వదినంగా జరుపు కొంటారు. అలాగే కార్తిక శుద్ధ విదియ పర్వదినాన చిత్రగుప్తుని జయంతిని కూడా జరుపు కుంటారు. సృష్టిలోని 84 లక్షల జీవరాశుల చావు పుట్టుకలను నిర్దేశించే గ్రంథం చిత్రగుప్తుని చిట్టా అని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ పుస్తకంలో ఆయా జీవరాశుల జనన, మరణాల సమయం కూడా ఉంటుందని పౌరాణిక కథనం. చిత్రగుప్తుడి జననం, వంశం, విధి నిర్వహణ గురించి పలు పురాణాలు చెబుతున్నాయి. సృష్టి ఆదిలో ఆయువు తీరిన జీవులన్నీ పరలోకం చేరాయి. పాపపుణ్య విచారణలో యముడు తీవ్ర గందర గోళానికి గురయ్యాడు. బ్రహ్మకు తన బాధను మొరపెట్టు కున్నాడు. బ్రహ్మ ఆలోచిస్తూ సమాధి స్థితిలోకి వెళ్లిపోవడంతో 11 వేల సంవత్సరాలు గడిచి పోయాయి. అప్పుడు ఆయన శరీరం నుంచి నడుముకు ఒక కత్తి కట్టుకుని, కలం, కాగితాల కట్టను చేతుల్లో పెట్టుకుని ఒక దివ్యపురుషుడు ఉద్భవించాడు. బ్రహ్మ ఆయనను యమలోకంలో పద్దుల నిర్వహకుడిగా నియమించాడు. ఆయనే చిత్రగుప్తుడు.కార్తిక శుద్ధ విదియ పర్వదినాన చిత్రగుప్త పూజను జరపాలని వ్రత గ్రంథాలు పేర్కొంటున్నాయి. ప్రధానంగా ఉత్తర భారతదేశంలో వ్యాపారులు చిత్రగుప్త పూజను నిర్వహిస్తుంటారు. ఈ రోజున తమ ఆదాయ, వ్యయాల రికార్డులను చిత్రగుప్తుని పటం ముందు ఉంచి ప్రార్థిస్తారు. బిహార్‌లో జరిపే ఛత్ పూజ కూడా చిత్రగుప్తుడికి సంబంధించిందే. ఎర్రటి వస్త్రంపై కలం, సిరాబుడ్డి, కత్తి, ఖాతా పుస్తకాలను ఉంచి పూజిస్తారు. చిత్రగుప్త పూజలో పసుపు, తేనె, ఆవాలు, అల్లం, బెల్లం, చక్కెర, గంధం, సిందూరం సమర్పిస్తారు. కేతువు అనుగ్రహం కోసం ఓం శ్రీ చిత్రగుప్తే నమః అనే మంత్రాన్ని జపిస్తారు. జీవుల సంస్కారాన్ని అనుసరించి వారి పాపపుణ్యాలను లిఖించాలని, చిత్రగుప్తుని బ్రహ్మ ఆదేశించినట్లు బృహత్ బ్రహ్మ ఖండంలో ఉంది. యజ్ఞ యాగాదుల్లో హవిస్సులు చిత్రగుప్తునికి చెందుతాయని పద్మపురాణం పేర్కొంటోంది. న్యాయ దేవతగా కూడా ఆయనను అభివర్ణించారు. యమ సంహితలో అత్యంత బాధ్యతాయుత విధుల్లో యమునికి సహాయం చేస్తుంటాడని ఉంది. జీవుల పుట్టుక నుంచి మరణం దాకా ప్రతి చర్యనూ నిగూఢంగా పరిశీలించి లిఖిస్తుంటాడు. శారీరక పాపాలతో పాటు మానసిక దోషాలను కూడా సంగ్రహించగలిగే అతీంద్రియ జ్ఞానం ఆయనకు ఉంది. చిత్రగుప్తుడు లెక్కతేల్చిన అనంతరం యమ ధర్మరాజు ఆ ఆత్మకు తగిన శరీరాన్ని నిర్ణయించి పునర్జన్మను ప్రసాదిస్తాడు. ప్రస్తుత యాంత్రిక యుగంలో కుటుంబ సభ్యుల మధ్య పరస్పర అవగాహన, మానవ సంబంధాలు, సంబంధ బాంధవ్యాలు క్రమక్రమంగా సన్నగిల్లుతున్నాయి. వాటిని తిరిగి నెలకొల్పడానికి, పునరుద్ధరించడం ద్వారా భారతీయ కుటుంబ వ్యవస్థ మళ్లీ వెలుగొందేలా చేయడానికి ఇలాంటి పండుగలు దోహద పడతాయి. అందరూ ఒకరినొకరు ఆత్మీయంగా, ప్రేమ పూర్వకంగా కలుసు కోవడానికి, పలకరించు కోవడానికి వేదికలుగా నిలిచేవి ఇటువంటి పర్వదినాలే. ఇలాంటి సంప్రదాయాల ఆచరణ ద్వారా ప్రస్తుత, రానున్న తరాల వారికి ఆప్యాయతలు, ప్రేమానురాగాలు, ఆత్మీయతలు, పెంపొందించే అవకాశం అనివార్యంగా ఉంది.

**-రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

# "అకాల మృత్యు హరుడు... ధర్మపురి యముడు"

### -భారతావనిలో

### అపురూప ఆలయం

యమ ద్వితీయ సందర్భంగా "భూషణవికాస శ్రీధర్మ పుర నివాస దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరులు శేషప్ప రాసిన నరసింహ శతక పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని, తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు నెలవుగా, అనాది కాలంగా హైందవ ధర్మ ప్రచారం కేంద్ర బిందువుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి, ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది సుప్రసిద్ధ గోదావరి తీరస్థ తీర్థమైన ప్రాచీన ధర్మపురి క్షేత్రం. తెలుగునేలపై సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవ నారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, హరి హర క్షేత్రంగా, పౌరాణిక, ఐతిహాసిక చారిత్రక ప్రాధాన్యతను సంతరించు కున్నది క్షేత్ర రాజ్యం. బ్రహ్మాండ, స్కందాది పురాణాలలో, ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం నిక్షిప్తమై ఉంది. ఈ క్షేత్ర దేవస్థాన అంతర్గతంగా ఉన్న యమధర్మరాజు మందిరం, విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతావనిలోనే అరుదుగా, అపురూపంగా, క్షేత్రంలో వెలసిన "యమధర్మరాజును దర్శిస్తే", "యమపురి" ఉండబోదని ప్రతీతి. హిరణ్యకశిపుని సంహరించిన అనంతరం ఉగ్ర నరసింహ స్వామిని శాంతింప చేసేందుకు, బ్రహ్మాది దేవతలు పుణ్య తీర్థం, పవిత్ర క్షేత్రము అయిన ధర్మపురిలో తపో, యజ్ఞ, ధ్యానం ఆది సత్కర్మలను ఒనరించి నట్లు స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకానొక సమయాన యమధర్మరాజు, తన లోకమునందు అనేక శారీరక బాధలను అనుభవించుచున్న పాపులను గాంచి, నిట్టూర్పులు విడిచి, తనలో తాను విచారిం చెను. పుణ్యాత్ములను దర్శించిన చో పుణ్యము, పాపాత్ములను




చూచినచో పాపమే లభించునని, నిత్యము పాపులను దర్శించుట వల్ల, తనకు పాప సంచయమే కలుగుతున్నదని, తనయందు స్వయంకృత పాపం అనునది ఏమాత్రము లేకున్ననూ, పాపుల నిత్య దర్శనంతో మనశ్శాంతి కలగడం లేదని తలంచి, మన శ్శాంతిని పొందుటకు పుణ్యక్షేత్ర దర్శన ప్రయాణోన్ముఖుడై, సమస్త క్షేత్రములను తిరిగెను. చివరకు ధర్మపురికి రాగా ఈ క్షేత్రమున గోదావరి నది స్నానము ఆచరించ గానే, యమునకు మనశ్శాంతి కలిగెనని, పాపాత్ముల దర్శన దోషములు తొలగెగని, బ్రహ్మాండం, స్కాంద పురాణాంతర్గత "ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం" ఆధారంగా నైమిశారణ్యంలో సూత పౌరాణికుడు, శౌనకాది మహర్షులకు వివరించినట్లు నారదుడు పృథు మహారాజుకు క్షేత్ర మహిమను తెలిపినట్లు వివరించ బడింది. యమధర్మరాజు నరసింహుని మందిరానికి ఏగి, చేసిన పూజలకు ప్రసన్నుడైన నరసింహుడు, యమధర్మరాజును తన సన్నిధిలో నివసించమని తెలిపెనని పురాణాల ఆధారం. యముడు గోదావరిలో స్నానమాచరించిన స్థలమునకు "యమ కుండము" అని పేరు కలిగినట్లు, అచట స్నానమాచరించి, నరసింహుని పూజించు వారికి యమ లోక బాధలు కలుగకుండా ఉండు న్నట్లు, సర్వ పాప విముక్తి కలుగునట్లు, నరసింహుడు వరం ఇచ్చినట్లు, యమ ధర్మరాజు తన అంశ రూపమును, నరసింహ మందిర పురో భాగమున నిలిపెనని, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. దేవస్థానంలో యోగానంద నరసింహ ప్రధానాలయం ముందు భాగాన, ఉంది యమ ధర్మ రాజ మందిరం. కోరలతో, యమ దండాన్ని ధరించిన భీకరాకార ఆరు అడుగుల భారీ విగ్రహం ఇదుంది. "దక్షిణాదిభి ముఖీ గంగా, యత్ర దేవో నృకేసరి, తత్ర శ్రీర్విజయోర్భూతి: కాశ్య యశ్వత గుణం భవేత్", అని అని దక్షిణ అభి ముఖియై ప్రవహిస్తున్న గోదావరి తీరస్థమైన, ధర్మపురి క్షేత్రం విశిష్టతను కలిగి ఉన్నది. వేరే ఎక్కడ కాన రాని విధంగా, ధర్మపురి క్షేత్రం వద్ద గోదావరి దక్షిణ వాహినిగా ప్రవహిస్తు న్నది. అష్టదిక్పాలకులలో ఒకరైన యముడు, దక్షిణ దిశకు అధిపతి. అంతేకాక గ్రహాల దృష్ట్యా, కుజుడు దక్షిణ దిశకు అధిపతి. కుజ గ్రహానికి మూలాధిపతి నరసింహుడు అని పరాశరుడు బృహత్ పరాశర హోరా శాస్త్రం నందు నుడివి ఉన్నాడు. కనుక ధర్మపురిలో దక్షిణ వాహినిగా ఉన్న గౌతమి యందు దక్షిణాభిముఖులై, స్నానాలు ఆచరిస్తే నరసింహుని దర్శిస్తే, నరక బాధలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ధర్మపురిలో వెలసిన యమ ధర్మరాజును దర్శించే భక్తుల సంఖ్య, నానాటికీ అధికమ వుతున్నది. ఇటీవల సంభవిస్తున్న అనూహ్య ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, అకాల మృత్యు నివారణకై అధర్వణ వేదంలో పేర్కొనబడిన "ఆయుష్య సూక్తం" ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే భరణి నక్షత్రం, చతుర్దశి తదితర ప్రత్యేక దినాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గురు వారం యమ ద్వితీయ సంధర్భంగా, అభిషేకం, ఆయుష్య సూక్తం, యమ సూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్తం, జ్వర హర స్తోత్ర పఠనాలు, రోగ నివారణ సూక్తాలు పూజలు, యమాష్టకాది నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,**
**కాలమిస్ట్....9440595494**

# అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నల్లగొండ ప్రతినిధి అక్టోబర్ 22( నినాదం) :** అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆమె దాన్యం సేకరణ పై పౌర సరఫరాలు, సంబంధిత శాఖల అధికారులతో తన ఛాంబర్ లో సమీక్షించారు. ఎక్కువ రోజులు కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం ఉండడం వల్ల వర్షానికి తడసిపోయే ప్రమాదం ఉందని, అందువల్ల వచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేసి, తేమను చూసి సరైన ప్రమాణాలతో ఉంటే తక్షణమే కొనుగోలు చేసి అప్పటికప్పుడే మిల్లులకు పంపించాలని చెప్పారు.వర్షాలను దృష్టిలో ఉంచుకొని రైతులు పూర్తి నాణ్యతతో కూడుకున్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని,తాలు,తరుగు, చెత్త,చెదారం లేకుండా, అలాగే సరైన తేమ శాతంతో కొనుగోలు కేంద్రాలకు తెచ్చినట్లయితే తక్షణమే కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందని, లేనట్లయితే వర్షం వల్ల ధాన్యం తడిసిపోతుందని, దానివల్ల రైతులకు ,నిర్వాహకులకు ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం సరైన తేమ, నాణ్యత ప్రమాణాలు కలిగి ఉన్నట్లయితే తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని చెప్పారు.

రెవెన్యూ అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్ ,నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, ధాన్యం సేకరణ నల్గొండ జిల్లా ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,జిల్లా సహకార అధికారి పత్యా నాయక్,ఆర్డీవో అధికారులు, తదితరులు ఉన్నారు.

## కీసరగుట్టలో కార్తిక మాసోత్సవాలు ప్రారంభం



**కీసర, అక్టోబర్ 22, (నినాదం) :** కీసర మండలం, కీసరగుట్ట శ్రీ భవాని శివ దుర్గా సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి, వచ్చేనెల 20వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ, ఈవో సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ మెంబర్లు, ఆలయ అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తా : పోజిశెట్టి శ్రీనివాస్



**మిర్యాలగూడ అక్టోబర్ 22 (నినాదం) :** న్యాయవాదుల అకాడమీకి కృషి చేస్తా హైకోర్టు న్యాయ వాది పొదిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మిర్యాలగూడబార్ అసోసియేషన్ లో ప్రచారం నిర్వహించారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేతి సత్యనారాయణ , జనరల్ సెక్రెటరీ అలుగుబెల్లి భూపతి రెడ్డి కలిసి ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ రాష్ట్ర బార్ కౌన్సిల్ నెంబర్ గా పోటీలో నిలిచినందున తనను గెలిపించాలని మిర్యాలగూడ కోర్టుకు సంబంధించిన న్యాయవాదులను తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వేడుకున్నారు, తనకు ఓటు వేసి గెలిపిస్తే న్యాయవాదుల అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలియజేశారు. బార్ కౌన్సిల్ ఆదాయ - వ్యయ లెక్కలు చూయించే విధంగా మార్పులు తీసుకొస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గోదాల వెంకట్ రెడ్డి ఏ జి పి గారు, సుదర్శనం రాంబాబు , కరణం లింగయ్య , కొంక వెంకన్న, చెలిమెల పద్మయ్య, మేక కుమార్ రెడ్డి, ధూపాటి ముట్టయ్య, ఎండి ఇబ్రహీం, మంద సైదులు, అలుగుబెల్లి సామ్రాజ్యం, రాయారపు భాస్కర్, కంది బండ శ్రీనివాస్, డి రాజశేఖర్ నాయక్, కళ్యాణ్ బాబు, బత్తుల రమణ, ఈస్రం కరుణాకర్, తక్కల్లపల్లి శ్రీనివాస్. పెద్దమాం కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## పంచెకట్టు వేడుకల్లో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కందాళ



**పాలేరు అక్టోబర్.22( నినాదం) :** నేలకొండపల్లి మండల సదాసివపురం గ్రామాల్లోని,పాలపాటి సురేష్-ఉమరాణి కుమార్తెలు,రిత్విక, నిషిత, కుమారుడు ప్రియన్స్,చిన్నారులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి.ఈ కార్యక్రమములో నేలకొండపల్లి మండల అధ్యక్షులు వున్నం బ్రహ్మయ్య నేలకొండపల్లి పైనంపల్లి సహకార సంఘం చైర్మన్ ను నాగుబండి శ్రీనిహసరావు కోటి సైదారెడ్డి, మండలం పార్టీ సెక్రెటరీ వెనంబోయిన శ్రీను, శాఖమూరి సతీష్,నెల్లూరు లీల ప్రసాద్,నంబూరి సత్యనారాయణ,మరికంటి రేణుబాబు,చాగంటి మధు సూదన్,అనగాని నరసింహారావు,షేక్ హుస్సేన్,మండల యూత్ అధ్యక్షుడు సోడిపొంగు ప్రశాంత్,మండల యూత్ సెక్రెటరీ కిషోర్,విద్యార్థి భాగం పగిడికత్తుల వినయ్,కామదాన ప్రవీణ్, పగిడికత్తుల రాంబాబు, లింగం ఎలమంద,సదాసివపురం గ్రామశాఖ అధ్యక్షుడు జిల్లపల్లి కాంతయ్య,కొమ్ము గోపాలకృష్ణ,వెంకన్న, కొఠారి ప్రసాద్,కాసాని వెంకటేష్,సోషల్ మీడియా అధ్యక్షుడు మాదాసు ఆదాం,తదితరులు పాల్గొన్నారు.


## నేటి నుంచే కార్తీక మాసం ప్రారంభం




**వికారాబాద్,అక్టోబర్ 22 (నినాదం):** శివ కేశవుకు ప్రీతి పాత్రమైన మాసం కార్తీక మాసం ఈరోజు బుధవారం నుంచి ప్రారంభం కానుంది, విశిష్టమైన కార్తీక మాసంలో దీపారాధన చేయడం ద్వారా సర్వ పాపాలు హరించుకుపోతాయని ప్రజల నమ్మకం సూర్యోదయానికి ముందే గోదావరి నది స్థానం చేసి శివకేశవ పూజలు చేసిన వారికి విశిష్టమైన పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. హిందూ సాంప్రదా యంలో కార్తీక మాసం అత్యంత పవిత్రమైన కాలంగా పరిగణించబడుతుంది. ఈ మాసం నేడు ప్రారంభ మవు తోంది.న కార్తీక నమో మాసః, న దేవం కేశవాత్పరం న చ వేద సమం శాస్త్రం, న తీర్థం గంగాయాస్తమమ్ అని స్కంద పురాణం లో పేర్కొనబడింది. అంటే కార్తీక మాసానికి సమానమైన నెల లేదు, కేశవుడికి సమానమైన దేవుడు లేడు, వేదాలకు సమానమైన శాస్త్రం లేదు, గంగకు సమానమైన తీర్థం లేదు అని అర్థం. ఈ మాసం శివకేశవులిద్దరికీ ప్రీతికర మైన కాలంగా ఉండటంతో, భక్తులు శివాలయాలు, విష్ణు ఆలయాలను దర్శించడానికి, దీపాలు వెలిగించడానికి, వ్రతాలు ఆచరించడానికి ముందుంటారు. కార్తీక మాసం ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే సమయం. ఈ కాలంలో శివుడు, కేశవుడు ఇద్దరినీ పూజించడం ద్వారా జన్మజన్మాం తర పాపాలు నశిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. భక్తులు తెల్లవారుజామున నదీ స్నానం చేయడం, దీపా రాధన, రుద్రాభిషేకం, తులసి పూజ, విష్ణు సహస్రనామ పారాయణం వంటి ఆచారాలను పాటిస్తారు. ముఖ్యంగా కార్తీక దీపం వెలిగించడం అత్యంత పుణ్యప్రదమని పండి తులు సూచిస్తున్నారు. ఈ నెలలో ఉపవాసం, ధ్యానం, భజ నల ద్వారా ఆత్మశుద్ధి సాధించవచ్చని విశ్వాసం ఉంది.కార్తీక మాసంలో పూజలు, దానాలు, ఉపవాసాలు చేయడం ద్వారా భక్తుడికి అఖండ పుణ్యం లభిస్తుంది. ఈ నెలలో గంగా స్నానం, అన్నదానం, వస్త్రదానం, గోదానం వంటివి శివకేశవు ల కృపను పొందడానికి మార్గంగా పరిగణించబడతాయి. ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి, తులసి కోట వద్ద దీపారాధన చేయడం భక్తి శ్రద్ధకు సూచిక. ఈ పవిత్ర మాసంలో ప్రతి భక్తుడు తన ఆత్మను దేవుని సన్నిధిలో లయపరచుకునే అవకాశం కలుగుతుంది. అందుకే కార్తీకం భక్తి, శాంతి, పుణ్యానికి ప్రతీకగా నిలిచే ఆధ్యాత్మిక యాత్రగా భావించబడుతోందని భక్తులు చెబుతున్నారు.

## బాల్యవివాహాల నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి

**ఆర్డీఎస్ సోషల్ మొబిలైజర్ దివ్యభారతి**





**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం) :** బాల్య వివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సోషల్ మొబిలైజర్ దివ్యభారతి కోరారు. మంగళ వారం రాత్రి వనపర్తి జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో బాల్య వివాహాల నిర్మూలన, ఎడ్యుకేషన్ పై అవేర్నెస్ ప్రోగ్రాం ను ఆర్డీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలపై కొవ్వొత్తులు వెలిగించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల జరగకుండా ప్రజలను చైతన్యం చేయాలని, ఈ విషయంలో విద్యార్థులు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. బాల్య వివాహాలు జరిగితే జరిగే అనర్థాలు, కేసులు, జరిమానా వంటి విషయాలను ప్రజలకు వివరించాలని కోరారు. బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికలు శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కోవడాన్ని ఆమె గుర్తు చేశారు. దీంతోపాటు విద్య విషయంలో విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని వారి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. మంచిగా చదువుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని, కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యార్థులు చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్ రెడ్డి, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## ప్యాలెస్ హోటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం



**పటాన్‌చెరు. అక్టోబర్. 22 (నినాదం) :** ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం శివారులో గల ప్యాలెస్ హోటల్ యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి బి. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్ కిషన్ రావు కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, "గత నాలుగు సంవత్సరాలుగా ప్యాలెస్ హోటల్ యాజమాన్యం అక్రమంగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తోంది. డోయన్స్ కౌంటీ వెంచర్ 60 ఫీట్ల రోడ్డు ను కబ్జా చేసి ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్లు వేసి యదేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారు" అని ఆరోపించారు. అతను మరింతగా మాట్లాడుతూ, "హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ మంజీరా పైప్‌లైన్ కిందుగా వెళ్లే ప్రాంతంలో మట్టి రోడ్డు వేసి సుమారు 20 గుంటల భూమిలో పార్కింగ్ చేస్తున్నారు. వీటికి ఎలాంటి పన్నులు చెల్లించడం లేదు. ట్రేడ్ లైసెన్స్ కూడా రెన్యువల్ చేయించలేదు. దీంతో మున్సిపల్ ఆదాయం కోల్పోతోంది" అని తెలిపారు. అలాగే హోటల్ నుండి వచ్చే మురుగు నీటిని పక్కనే ఉన్న కుంటలోకి విడుదల చేస్తున్నారని, ఇంత పెద్ద హోటల్‌కి ఈటీపీ ప్లాంట్ లేకపోవడం నిర్లక్ష్యమని విమర్శించారు. రోడ్లను ఆక్రమించి వ్యాపారం కొనసాగిస్తున్న ప్యాలెస్ హోటల్ యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఏరియా కమిటీ సభ్యులు శాంత్‌కుమార్, పోచయ్య, రాజు, నర్సింలు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఆర్టీఏ చెక్ పోస్ట్‌లు ఎత్తివేత..




- ఇకపై రోడ్లపైనే వాహన తనిఖీలు
- పదకొండేళ్లు సేవలందించిన కోదాడ చిమీర్యాల చెక్ పోస్ట్ మూసివేత...
- ఈ నెల 28న ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- మరింత సులభతరంగా వాహనాల రాకపోకలు అధికారుల్లో మొదలైన గుబులు




**కోదాడ (నినాదం):** తెలంగాణ రవాణా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి రాష్ట్రంలోని అన్ని చెక్ పోస్టులను రద్దు చేస్తున్నట్టు రవాణా శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన రవాణా శాఖ చెక్ పోస్టుల్లో అవినీతి రవాణా అవుతోంది. కొందరు అధికారులు ప్రైవేటు సిబ్బందిని పెట్టుకుని యథేచ్ఛగా అక్రమ వసూళ్లు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని రవాణా శాఖ చెక్‌పోస్టులను రద్దు చేస్తూ జులై ఆఖరి వారంలోనే రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. నెలరోజులు ఆలస్యంగా జీఓ జారీ అయ్యింది. ఉత్తర్వులు వచ్చి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా చెక్ పోస్టులను ఇంకా తొలగించలేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక చెక్‌పోస్టుల అవసరం దాదాపుగా తగ్గింది. కేంద్రం సూచనల మేరకు దేశంలోని అనేక రాష్ట్రాలు సంవత్సరాల క్రితమే చెక్ పోస్టులను రద్దు చేశాయి. కానీ తెలంగాణలో కొనసాగుతున్నాయి. ఏడాదిన్నర క్రితమే తెలంగాణలో చెక్‌పోస్టుల రద్దుకు రవాణాశాఖ నిర్ణయం తీసుకున్నా.. ఇన్నాళ్లు ఆ నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టులు రద్దు చేయాలని రవాణా శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

**పదకొండేళ్లు సేవలందించిన చెక్ పోస్ట్ మూసివేత...**

రాష్ట్ర పునర్విభజన తర్వాత ఏర్పడిన చెక్పోస్ట్ కోదాడ మండలం చిమిర్యాల క్రాస్ రోడ్డు వద్ద గల ఆర్టీఏ చెక్పోస్ట్.... అనేక విస్తృతమైన సేవలను అందించిన ఈ చెక్ పోస్ట్ అధికారుల ఆదేశాలలతో బుధవారం మూసివేశారు. కార్యాలయం ఎదుట మూసి వేసినట్లుగా ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు.రాష్ట్రంలోనే రద్దీగా ఉండే చెక్పోస్టులో ఒకటిగా గుర్తింపు పొందింది.

**లాభనష్టాలు:**


:చెక్‌పోస్టుల తొలగింపు వల్ల వాహనాల రాకపోకలు మరింత సులభతరం అవుతాయి. వస్తు రవాణా వేగవంతమై వ్యాపారులకు ఖర్చు, సమయమనేది ఆదా అవుతుంది. చెక్‌పోస్టుల నిర్వహణ వ్యయం ప్రభుత్వానికి తగ్గనుంది. మరోపక్క నిషేధిత వస్తువులు(డ్రగ్స్, మద్యం, డ్రగ్స్) రవాణా పెరిగే ప్రమాదం ఉంది. భద్రతాపరమైన సమస్యలతోపాటు సరకు రవాణాలో అక్రమాలు చోటుచేసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. పన్నులు చెల్లించకపోవడం, పర్మిట్లు తీసుకోకపోవడం లాంటి వాటితో సర్కారు ఆదాయానికి గండిపడే అవకాశం ఉంటుంది. చెక్పోస్టుల తొలగింపు వల్ల వాహనాల సగటు వేగం పెరుగుతుంది. ట్రాఫిక్ సమస్య తగ్గేందుకు అవకాశం ఉంది.

**అధికారుల్లో గుబులు! :**

ఉమ్మడి జిల్లాలో రవాణా చెక్‌పోస్టుల నుంచి ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తుంది. అయితే అంతకన్నా ఎక్కువగా అక్కడ విధులు నిర్వర్తించే కొంతమంది సిబ్బంది లాభపడుతుంటారనే విమర్శలున్నాయి. ఇక్కడ పోస్టింగ్ తీసుకునేందుకు వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో పాటు కానిస్టేబుల్స్ సైతం మరింత ఉత్సాహం చూపిస్తుంటారు. మంత్రుల స్థాయిలో ప్రయత్నిస్తుంటారు. ఒక్క రోజు విధులు నిర్వర్తిస్తే మరుసటి రోజు సెలవుతోపాటు అమ్యామ్యాలకు కొదవ ఉండకపోవటమే దీనికి కారణమనే అభిప్రాయం ఉంది. ఏ అధికారి విధుల్లో ఉంటే ఆయన అసిస్టెంట్లే (ప్రైవేటు సిబ్బంది) అన్నీ చూసుకుంటారు. జరిమానా తదితర అన్ని పనులు వీరే నియంత్రిస్తారు. చెక్‌పోస్టుల ఎత్తివేతతో ఇలాంటివాటికి అడ్డుకట్టపడనున్నాయి.

## విమానాశ్రయ స్థల సేకరణ ప్రక్రియ పూర్తిచేయండి

- ఇండస్ట్రియల్ పార్కు, స్టేడియంకు స్థలం కేటాయించాలి
- కేంద్రీయ విద్యాలయం త్వరితగతిన ప్రారంభించేందుకు చొరవ తీసుకోండి
- వేర్ హౌస్ గోడౌన్లు, ఆటో నగర్ నిర్మాణాలకు సహరించాలి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని
- కలెక్టరుతో ఎమ్మెల్యే భేటీ.. పలుఅంశాలపై సుదీర్ఘ చర్చ



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్22(నినాదం) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ప్రతిపాదనలో వున్నా విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి స్థలసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు జిల్లా కలెక్టరును కోరారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తో మంగళవారం రాత్రి కలెక్టర్ కార్యాలయంలో కూనంనేని భేటీ అయ్యారు, నియోజకవర్గానికి, జిల్లాకు సంబందించిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఇండస్ట్రియల్ పార్కు, క్రీడా స్టేడియం నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులు లభించాయని, స్థలం సమస్య తలెత్తకుండా చొరవతీసుకోవాలని కలెక్టరును కోరినట్లు కూనంనేని తెలిపారు. వీటి నిర్మాణాలకు ప్రభుత్వ స్థలాలను పరిశీలించి కేటాయించాలని, అదేవిధంగా వేర్ హౌస్ కార్పొరేషన్ గొడౌన్ల నిర్మాణంకోసం 10 ఎకరాల స్థలం మంజూరు చేయాలనీ, ఆటో నగర్ కోసం అందుబాటులో ఉన్న ఖాళీస్థలాలు కేటాయించాలనీ కోరినట్లు తెలిపారు. కేంద్రీయ విద్యాలయం త్వరితగతిన ప్రారంభించేందుకు చొరవతీసుకోవాలని కోరినట్లు తెలిపారు. స్థల కేటయింపులకు సంబందించిన జిల్లా కలెక్టరుకు లేఖలు అందించడం జరిగిందని, ఇప్పటికే ప్రభుత్వ పెద్దలకు లేఖలు అందించి వత్తిడి తెస్తున్నట్లు కూనంనేని తెలిపారు. విమానాశ్రయం, ఆటో నగర్, ఇండస్ట్రియల్ పార్క్, స్పోర్ట్స్ స్టేడియం, కేంద్రీయ విద్యాలయం, వేర్ హౌస్ గోడౌన్ల నూతన భవనాలతో కొత్తగూడెం నియోజకవర్గం, అదేవిధంగా ఈ జిల్లా మహానగరాల సరసకు చేరుకుంటుందని కూనంనేని తెలిపారు. వాటి నిర్మాణాలు పూర్తిచేసేవరకు విశ్రమించబోనని స్పష్టం చేశారు.

## టీ రహిత సమాజం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలి డాక్టర్ వరి కూటి సుబ్బారావు



**మధిర, అక్టోబర్ 22 (నినాదం):** మధిర మండల పరిధిలోని దెందుకూరు పీహెచ్సీ ని బుధవారం ఉదయం ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరపున జిల్లా క్షయ నివారణ ప్రోగ్రాం అధికారి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తమ వైద్యుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ వరికోటి సుబ్బారావు ఈరోజు అకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. సిబ్బంది హాజరు వివరాలు, ఫేస్ అటెండెన్స్ గురించి రికార్డ్స్ పరిశీలించి పారామెడికల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం టీబీ కేసులు నమోదు, తెమడ సేకరణ శాంపిల్సు సిబ్బందిని అడిగి తెలుసుకుని, టీబీ రహిత సమాజం కోసం పారా మెడికల్ సిబ్బంది ప్రతి ఒక్కరూ సహృదయంతో పని చెయ్యాలని, ప్రజలకు టీవీ గురించి అవగాహన పరచాలని, మందులను సకాలంలో పేషంట్ వేసుకునే విధంగా డాట్ ప్రొవైడర్ సహకరించాలని తెలిపారు. టీబీ చిత్రపటాల అవగాహన నిమిత్తం, డాక్టర్ సుబ్బారావు పారామెడికల్ సిబ్బంది చేతుల మీదుగా ఆవిష్కరణ చేసి గ్రామాల్లో ప్రజలను టి బి పై అప్రమత్తంగా ఉండే విధంగా చూడాలని, టి బి ముక్తభారత్ గా పని చేయాలని తెలిపారు. అదేవిధంగా దీర్ఘ కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, విలువైన ఉచిత మందులు వాడుతున్న కొంతమంది పేషంట్ కార్డులను తనిఖీ చేసి ఆరోగ్య సూత్రాలు బోధించారు ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ చెరుకూరి దివ్య శృతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి వెంకటేశ్వర్లు, టిబి యూనిట్ మధిర ట్రీట్మెంట్ సూపర్వైజర్ సందీప్, టీబీ నోడల్ పర్సన్ లంక కొండయ్య, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.